క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

లింగాలఘణపురం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న(సోమవారం) ఎంపీపీ చిట్ల జయశ్రీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జున్ తెలిపారు. సమావేశానికి మండల సభ్యులతో పాటు సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు హుండీ లెక్కింపు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరు గుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీలను రేపు (28వ తేదీ) లెక్కించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ వెంకట్రావు, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు హుండీలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌లో చేరిక

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన ప్రజా కళాకారుడు ఉదయ్‌కిరణ్ ఆదివారం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు తూర్పాటి సారయ్య, శారద పాల్గొన్నారు.

నర్సిరెడ్డి సేవలు చిరస్మరణీయం

రఘునాథపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ నర్సిరెడ్డి సేవలు చిరస్మరణీయమని జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అన్నారు. ఆదివారం మండలంలోని రామన్నగూడెంలో ఇటీవల మృతిచెందిన నర్సిరెడ్డి దశదినకర్మలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మూడు దశాబ్దాల పాటు నర్సిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని కొనియాడారు.

అంబులెన్స్‌లో ప్రసవం



కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన నక్క స్వాతి ఆదివారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేయగా స్వాతిని జనగామలోని ఎంసీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ప్రశాంత్ పైలెట్ రాజ్‌కుమార్ సహకారంతో ప్రసవం నిర్వహించగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను ఎంసీహెచ్ ఆస్పత్రికి చేర్చగా అంబులెన్స్ సిబ్బందిని కుటుంబసభ్యులు అభినందించారు.

ప్రతీ వాడకు సీసీ రోడ్డు

చిల్పూరు: ఇక గ్రామంలో ప్రతీ వాడకు సీసీ రోడ్డు నిర్మాణం చేయిస్తామని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య ప్రారంభించారు. ఉప సర్పంచ్ ఈర్ల రూపేష్, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య రమేష్ నాయక్, మండల రైతు కోఆర్డినేటర్ జనగాం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి శశికుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

దేవరుప్పుల: మండలంలోని ధరావత్‌తండా పరిధిలో ఓ వ్యక్తిపై దాడి చేయడమేగాక ఇంటి సామగ్రి తగులబెట్టిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. రమేష్‌నాయక్ తెలిపారు. దారావత్‌తండా పరిధి గోప్యనాయక్ తండాలో దారావత్ ఠాగూర్ తమ సమీప రైతు రాహుల్ బీడు భూమిలో నుంచి వాహనంపై వెళ్లే క్రమంలో ఇక్కడి నుంచి ఎందుకు పోతున్నావని దాడికి పాల్పడగా బాధితుడు రాహుల్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తనపై కేసు ఎందుకు పెట్టావని రాహుల్ తన కుటుంబ సభ్యులైన లక్ష్మణ్, కమలమ్మ మరొకరు కలిసి టాగూర్ ఇంటిపై దాడి చేసి టీవీ, మోటర్ సైకిల్ తగులబెట్టడమేగాక దాడికి పాల్పడ్డారు. ఈ రెండు సంఘటనలపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తి అదృశ్యం


అడివయ్య

జనగామ రూరల్: జనగామ మండలంలోని పెద్దపహాడ్‌కు చెందిన నర్ర అడివయ్య ఈనెల 23వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడని ఆదివారం జనగామ పోలీస్ స్టేషన్‌లో భార్య నర్ర భారతమ్మ ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కూలీ పని నిమిత్తం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై 23న ఉదయం 10 గంటలకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదని తెలిపింది. ఇంటి నుంచి బయటికి వెళ్లేటప్పుడు బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ లుంగీ ధరించాడని పేర్కొంది. ఆచూకి తెలిస్తే జనగామ పోలీస్‌స్టేషన్ 87125 85032, 87126 85259 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


దేవరుప్పుల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


కొడకండ్ల: సమ్మేళనంలో 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు


రఘునాథపల్లి: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. 36 సంవత్సరాలు గడిచిన సందర్భంగా తమ బాల్య స్మృతులను, అనుభవాలను పంచుకొన్నారు. తమకు విద్య నేర్పిన గురువులను పూలదండలతో షీల్డ్ బహూకరించి శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు కోనేటి నరసయ్య, మొలుగూరి వెంకటేశ్వర్లు, ఎండి లియాఖత్‌అలీ, షేక్ సలీం, సత్యనారాయణ, నల్ల వీరస్వామి, ఉప్పుల ఐలయ్య, ఆర్.నరసయ్య, వెంకన్న, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనగామ: చిన్ననాటి ముచ్చట్లు.. తరగతి గదిలో చేసిన అలర్లు. ఇలా పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తుకు చేసుకున్నారు. జనగామ సరస్వతి శిశు మందిర్ 1996-97 పదో తరగతి పూర్వ విద్యార్థులు పట్టణంలోని గ్లోరీ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు


జనగామ: సమ్మేళనంలో 1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

హరినాథరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, పార్థసారథి మాట్లాడుతూ ఇంజనీర్ వైఫల్యం చెందితే నిర్మాణాలకు పగుళ్లు పడితే.. డాక్టర్ తప్పిదం ఓ నిండు ప్రాణాన్ని తీస్తుందన్నారు. కానీ బడిలో గురువు, తల్లిదండ్రులు చిన్న పాటి నిర్లక్ష్యం చేస్తే.. ఓ తరం పిల్లల జీవితాలే నాశనమవుతాయని, అందుకే పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. సమ్మేళనంలో విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యార్థులు శ్రీనివాస్, శ్రీధర్, రాజు, రవళి, విశ్వనాథ్, సంతోష్, సురేష్, గణేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1990-91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య స్నేహితులు మళ్లీ కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత అదే పాఠశాలకు చేరుకొని సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఒకరికొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కరచాలనాలు, అలింగనాలతో పట్టరాని ఆనందంతో గడిపారు. తమను విద్యా విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, సమాజాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

రామవరం ఉన్నత పాఠశాలలో..

కొడకండ్ల: మండలంలోని రామవరం ఉన్నత పాఠశాలలో 2001-02 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకొన్నారు. తమ గురువులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని గురువులను సన్మానించారు. అలాగే ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి చల్ల విజయలక్ష్మి భర్త మృతిచెందడంతో ఆమెకు రూ.10 వేల సాయాన్ని, పాఠశాలకు రూ.12 వేల విలువైన ప్రింటర్‌ను హెచ్‌ఎం ప్రభాకర్‌కు పూర్వ విద్యార్థులు అందజేశారు.

భగీరథ పైపులైన్ ధ్వంసం



కొడకండ్ల: మిషన్ భగీరథకు సంబంధించిన పైపులైన్ ఆదివారం ధ్వంసమవడంతో నీరు వృథాగా పోయింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొడకండ్ల బస్టాండ్ వద్ద జేసీబీతో తవ్వే క్రమంలో మిషన్ భగీరథకు సంబంధించిన మెయిన్ పైపులైన్‌కు తగిలి ధ్వంసమైంది. దీంతో ట్యాంక్‌కు వెళ్లాల్సిన నీరు రోడ్డుపై వృథాగా పోయింది. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ మరమత్తు చేయించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తప్పవు

రఘునాథపల్లి: చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని, ఈవిషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని జనగామ రూరల్ సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని వెల్దిలో ఆదివారం సాయంత్రం సీపీ ఆదేశాల మేరకు సర్పంచ్ కొయ్యడ మల్లేష్ ఆధ్వర్యంలో గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్సై వీరేందర్, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే తనిఖీలు

చిల్పూరు: రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే సీపీ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల-మల్కాపూర్ గ్రామాల మధ్య ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు ద్విచక్ర వాహన దారులు మద్యంసేవించి ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం


విద్యార్థినికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రఘునాథపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలుగల ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సుజాత అన్నారు. ఆదివారం మండలంలోని కోమళ్లలో పోషణ పక్వాడ్ సందర్భంగా కిశోర బాలికలు, మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ రక్తహీనత ఉన్న మహిళలు, కిషోర బాలికలు సరైన పోషకాహారంతో పాటు చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, సామల వాడకం పెంచాలని, వాటితో ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుప్రియ, ఫాతిమా, హేమలత, భాగ్యలక్ష్మి, సంపూర్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన బలిజ హన్మంతు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఆదివారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉపసర్పంచ్ మారపాక రాములు, గ్రామ పెద్దలు ఎండీ.నజీర్, పరుశరాములు, యూత్ నాయకులు నాగరాజు, బలిజ రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో ఆధ్యాత్మిక జ్ఞానం


ప్రచారం చేస్తున్న ప్రబోధకులు

జనగామ రూరల్: భగవద్గీత పఠనంతో ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మికజ్ఞానం పెరగడంతోపాటు క్రమ శిక్షణ, భక్తి భావం కలుగుతుందని హిందూ జ్ఞాన వేదిక భువనగిరి కమిటీ అధ్యక్షుడు దేవేందర్ అన్నారు. ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో జనగామలోని ఇందిరమ్మ, విద్యానగర్‌కాలనీల్లో భగవద్గీత గ్రంథాల ప్రచారం చేపట్టారు. శంకర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, నరేష్, బుచ్చిరాములు, ఉపేందర్, సాయికిరణ్, ప్రసాద్, జస్వంత్, లతా, ధనలక్ష్మి, లలిత పాల్గొన్నారు.

కురుమలకు సముచిత స్థానం కల్పించాలి

బచ్చన్నపేట: రాజకీయాల్లో కురుమలకు సముచిత స్థానం కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కురుమలు పలు పార్టీల్లో కీలక పాత్రలను పోషిస్తున్నారన్నారు. ఏపార్టీలో పని చేస్తున్న వారైనా కురుమ సంఘం నాయకులు పార్టీ తరుపున ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుంటే ఆ నాయకున్ని గెలిపించుకోవడానికి అందరూ కృషి చేయాలని కోరారు. జూకంటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీకి ఆహ్వానం


ఏసీపీకి శ్రీరామనవమి శుభలేఖ అందిస్తున్న ఆలయ పూజారి, భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమలనాథస్వామి దేవస్థానంలో ఈనెల 30న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్‌కు ఆలయ పూజారి కలకోట రామానుజచార్యులు ఆహ్వాన శుభలేఖను ఆదివారం అందించారు. దేవస్థానంలో రోజువారిగా జరిగే పూజలకు ఏసీపీ హాజరుకాగా ఆలయ పూజారి, భక్తులు ఏసీపీకి శ్రీరామనవమి శుభలేఖను అందించారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ ఈనెల 30న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. గోలి శ్రీనివాస్, సరాబు ఆంజనేయులు, యాద శ్రీనివాస్, వెంకన్న, శశాంక్ పాల్గొన్నారు.

విహార యాత్రలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి


విహార యాత్రలో విద్యార్థులు

బచ్చన్నపేట: విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని మండలంలోని దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రఘుమూర్తి అన్నారు. ఆదివారం పాఠశాల విద్యార్థులను చిర్ర సాయిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో విహార యాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో రాష్ట్రపతి నిలయం, జంతు ప్రదర్శనశాల, చార్మినార్, మక్కా మసీద్, హైకోర్టు, సాలార్జంగ్ మ్యూజియం తదితర ప్రదేశాలను విద్యార్థులకు చూపించామన్నారు. ఉపాధ్యాయులు పద్మ, ప్రవీణ్, రత్నం, కనుకయ్య పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు


జనగామ రూరల్: ఇంటింటా ప్రచారం చేస్తున్న జోగు ప్రకాష్ తదితరులు

చిల్పూరు: బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో ఆదివారం గ్రామ శాఖ అధ్యక్షుడు సాదం శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ఈనెల 27న జిల్లా కేంద్రంలో, 29న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ముగింపు సభలను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సాదం పరమేష్, సాదం చంద్రయ్య, నారబోయిన భిక్షపతి, పోలు శ్రీను, సాదం రాజు, ఊరడి మల్లయ్య, సాదం భీమయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జనగామ రూరల్: మతోన్మాద బీజేపీ విధానాలను ఎండగట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర విధానాలతో ప్రజలపై పడుతున్న భారాలను వివరించారు. పట్టణంలో సోమవారం నిర్వహించే ప్రజా చైతన్య బస్సు యాత్రను కార్యకర్తలు, మేధావులు, విద్యార్థి, యువజన, కార్మిక అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సాయంత్రం 5 గంటలకు జనగామ చౌరస్తాలో బహిరంగసభ ఉంటుందని తెలిపారు. కళ్యాణి, రజిత, నాయకులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


బచ్చన్నపేట: యజ్ఞంలో పాల్గొన్న గ్రామస్తులు


చిల్పూరు: రామాలయంలో హోమం నిర్వహిస్తున్న దంపతులు


చిల్పూరు: శివాలయానికి నాగపడిగెను తీసుకొచ్చిన దాతలు

బచ్చన్నపేట: మండలంలోని ఎద్దుగూడెంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో ఆదివారం ఘనంగా హోమాలు, యజ్ఞాలను గ్రామస్తులు నిర్వహించారు. ఉదయం దేవతా పూజలు, మూల మంత్ర జప అనుష్టానములు, విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శివ-రామస్మరణతో మార్మోగిన మల్కాపూర్

చిల్పూరు: ఒకపక్క శివనామస్మరణ, మరోపక్క రామనామ స్మరణ వెరసి ఊరంతా నామస్మరణలతో మార్మోగిపోతోంది. మండలంలోని మల్కాపూర్ రామాలయంలో ఈనెల 22 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆర్‌జే యూత్, భజరంగ్‌దళ్, మేకింగ్ మై విలేజ్, శ్రీసీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సీతారాముల కల్యాణ పట్టాభిషేకంలో భాగంగా ఆదివారం అర్చకులు చొల్లేటి రాజేశ్వర శర్మ వేద మంత్రాల నడుమ సూర్య భగవాన్ అభిషేకం, హోమ కార్యక్రమం నిర్వహించారు. హోమంలో పోలేపల్లి రంజిత్‌రెడ్డి-మాధవి, పోలేపల్లి రాంరెడ్డి- సంధ్య, యశ్వంత్‌రెడ్డి-ప్రవళిక, మోహన్‌రెడ్డి-రమ, వెంకట్‌రెడ్డి-వెంకటమ్మ దపతులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన తీగల రమేష్ ఆధ్వర్యంలో ఆలయ సెట్టింగు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ బబ్బుల వంశి, ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్, ఏడవెళ్లి మాధవరెడ్డి, బబ్బుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రామంలో మార్కండేయ సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రుద్రేశ్వరస్వామి శివాలయంలో కుసుమ రమేష్, బాల్నె రామయ్య, కుసుమ రవి ఆధ్వర్యంలో నాగపడిగెను ప్రతిష్ఠించారు.

కోదండ రామస్వామి ఆలయం ముస్తాబు


ఆలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు


ఉత్సవ విగ్రహాలు

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయాన్ని ఈ నెల 30న జరిగే శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబు చేశారు. ప్రతీ ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణంతో ప్రారంభమై, 27న గరుడ సేవ, 28న అంకురార్పణ, దీక్షాస్వీకారం, ప్రసాద వితరణ, 29న గరుడ ముద్ద, ఎదరు కోలుతో కల్యాణ తంతు నిర్వహించి 30న కోదండ రాముని కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అందుకు ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ వెలుగులతో అలంకరించారు. ఈఓ శ్రీవంశీ భక్తులకు తగిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

స్థల పురాణం..

నవాబుపేటలో బాలనర్సింహస్వామి రాతి విగ్రహం పుట్ట, దాని ముందు ఆంజనేయ విగ్రహం, రావి చెట్టు ఉండేది. ప్రతి శుక్రవారం జాతర జరిగేది. నవాబుపేట గ్రామరాణి వెంకట మాలతీబాయి కలలో కోదండ రాముడు దర్శనమిచ్చి రామ మందిరం నిర్మించమని కోరగా 1945లో పాంచరాత్ర ఆగమ సిద్ధాంతం అనుసరించి నిర్మించారు. దూపదీప నైవేద్యానికి అక్కడున్న భూములు ఆలయం పేరుతో పట్టా చేశారు.

అంతేకాకుండా ఆలయ అభివృద్ధి కోసం ప్రతీ శుక్రవారం పశువుల అంగడిని ప్రారంభించారు. అప్పటి నుంచి దినదినం ఆలయం అభివృద్ధిలో పయనిస్తుంది.

పరామర్శ


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చిగురు సరిత భర్త ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. అతడి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, ఎంపీటీసీ గుర్రం రాజు, టీఆర్‌ఎస్ నాయకులు మాచర్ల గణేష్, కొంతం శ్రీను, జ్యోతిరెడ్డి, బొల్లు లక్ష్మీ, ఎం. సునీత, నాగపురి పావని, మమత తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న సర్పంచ్ రవీందర్

చిల్పూరు: లింగంపల్లిలో మహిళా కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఆదివారం అర్చకుల వేద మంత్రాల నడుమ సర్పంచ్ ఏదునూరి రవీందర్-రమాదేవి(వీఏఓ) దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మహిళలు సమావేశం నిర్వహించుకునేందుకు భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంకటి రాజన్న, రాజు, రవీందర్, రవీంద్రచారి, సిద్ధు, ప్రభాకర్, సత్తయ్య, సారయ్య, రమేష్ ఉన్నారు.